ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని వినతి


ఏసీపీని సత్కరిస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీఐ నిరంజన్‌రెడ్డిని మంగళవారం కలిసి మణికొండ, పుప్పాలగూడ రోడ్లపై ట్రాఫిక్ సమస్యను వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణికొండ ప్రభుత్వోన్నత పాఠశాల సర్కిల్‌లో నాలుగు రోడ్లు ఉండడంతో అక్కడ తీవ్రంగా ట్రాఫిక్ జాం అవుతుందన్నారు. మర్రిచెట్టు నుంచి వచ్చే వాహనాలను వన్‌వే రూపంలో మార్చితే సమస్య తీరుతుందన్నారు. అలాగే మణికొండ మై పెట్రోల్ పంప్ నుంచి అంజలిగార్డెన్ మీదుగా మరో వన్‌వే ఏర్పాటు చేయాలన్నారు. పుప్పాలగూడ సాయిరాం కాలనీ చౌరస్తా వద్ద ప్రతి రోజు ట్రాఫిక్ జాం ఏర్పడుతుందన్నారు. పుట్‌పాత్‌లను ఆక్రమించి షాపులు విస్తరించటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తొలగించాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ పీ అవినాశ్, ప్రధాన కార్యదర్శి వీ ఆంజనేయులు, కోశాధికారి బాబురావు, నాయకులు కృష్ణకుమార్, వంశీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూల శ్రీనివాస్ గౌడ్ సేవలు మరువలేనివి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: మూల శ్రీనివాస్ గౌడ్ సేవలు మరువలేనివని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుద్వేల్ వాస్తవ్యులు, రంగారెడ్డి జిల్లా దళిత మోర్చా మాజీ అధ్యక్షుడు కోరని భిక్షపతి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు మూల శ్రీనివాస్ గౌడ్ ఈ నెలలో మృతి చెందారు. దీంతో బుద్వేల్ శివాంజనేయ స్వామి గుడి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సంతాప సభకు ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహా రెడ్డి, ఇరు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. శ్రీనివాస్ గౌడ్ లాంటి కార్యకర్తను కోల్పోవడం పార్టీకి ఎంతో నష్టం అని వారి కుటుంబాలను పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో అంజన్ కుమార్ గౌడ్, నారగూడెం మల్లారెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎం.కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, సంగీతాగౌరీ శంకర్, కోరని సదానందం, డీ సత్యనారాయణ ముదిరాజ్, లోహిత్ రెడ్డి, కుమార్, వెంకటేశ్, చంద్రమౌళి, విజయ్ కుమార్, విక్రమ్ చారి, కోరని క్రాంతి, బండారి బాలకృష్ణ, సందీప్ ముదిరాజ్, రాకేశ్ గౌడ్, రాఘవేంద్ర చారి, మల్లేశ్ చారి, జీ పద్మావతి, రాజ్ కుమార్, శత్రుఘ్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో లక్ష్మీ పూజ


పూజల్లో డీఈ, ఏడీఈ, సిబ్బంది

మణికొండ: నార్సింగిలోని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. రానున్న రోజుల్లో వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని, తమ శాఖకు మంచి ఆదాయం రావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో డీఈ రమేశ్‌చంద్ర, ఏడీఈ (సీఎస్‌సీ) సైదులు, సహాయ అకౌంట్స్ అధికారి రాజు, ఉద్యోగ సంఘం నాయకుడు భాస్కర్‌రెడ్డి, జూనియర్ అకౌంట్స్ అధికారి పరబ్రహ్మమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంపై సమగ్ర నివేదిక అందించండి


గంగోత్రిరోడ్డు అక్రమ లేఅవుట్‌లో వేసిన సీసీ రోడ్డు

మణికొండ: మున్సిపల్ నిధులతో నిబంధనలకు విరుద్ధంగా దేవాదాయ శాఖ భూమిలో సీసీ రోడ్లు వేయడంపై సమగ్ర నివేదిక అందించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్, అడ్మినిస్ట్రేషన్ అధికారి(సీడీఎంఏ) మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను ఆదేశించింది. మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ సర్వే నంబర్ 112లో దేవాదాయ శాఖ భూమి ఉంది. సదరు భూమిని గతంలో పూజారులు విక్రయించడంతో అందులో లే అవుట్ వచ్చింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం సదరు భూమి ఇప్పటికీ దేవాదాయ శాఖ భూమిగానే ఉండగా కోర్టు కేసులు కూడా కొనసాగుతున్నాయి. గతంలో పంచాయతీలుగా ఉన్నప్పటి నుంచి రోడ్లను పలుమార్లు దేవాదాయ శాఖ అధికారులు, స్థానికులు నిలిపివేశారు. ఇటీవల మణికొండ మున్సిపల్ కమిషనర్ సదరు లే అవుట్‌లో ఉన్న రోడ్లను మున్సిపల్ నిధులతో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. సదరు లేఅవుట్‌లో నిర్మాణాలకు మున్సిపాలిటీ ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని అయినా రోడ్ల నిర్మాణం చేపట్టడంతో అదే కాలనీకి చెందిన వెంకట్ అనే వ్యక్తి రాత పూర్వకంగా సీడీఎంఏకు ఫిర్యాదు చేశారు. దాంతో స్పందించిన సీడీఎంఏ అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు.

శివరాంపల్లి నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా సన్నీరెడ్డి

రాజేంద్రనగర్: శివరాంపల్లి నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా సదాల సన్నీరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో గ్రామ పెద్దల సమక్షంలో ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పిట్టల వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మల్లెల సూర్యచరణ్ రెడ్డి, కోశాధికారిగా పడమటి త్రిభువన్ రెడ్డి, సహాయ కోశాధికారిగా నిశాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సాంబ జగదీష్ యాదవ్, జెల్లా మనోజ్ యాదవ్, సదాల సాయిరాం రెడ్డి, రామోజీరావు, పిట్టల సాయి ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సదాల సన్నీరెడ్డి మాట్లాడుతూ..శివరాంపల్లి అభివృద్ధికి పార్టీలకతీతంగా పని చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. శివరాంపల్లిలో పండుగలను వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. కమిటీని ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మెనేజర్ బి.వి.కె.మూర్తి అన్నారు. ప్రయాణికులు, కాలనీ సంక్షేమ సంఘాల నుంచి తగిన సలహాలు, సూచనల కోసం నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. సలహాలు, సూచనల కోసం 99592 26133లో సంప్రదించాలన్నారు.

అభివృద్ధిలో పథంలో శంషాబాద్ మున్సిపాలిటీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నూతన మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశమందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అధ్యక్షతన మంగళశారం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. మొత్తం రూ. 4.5 కోట్ల బడ్జెట్‌తో చేపట్టనున్న వివిధ పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కమిషనర్ సుమన్‌రావు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన విద్యార్థులు, నాయకులు


వీసీకి పూలమొక్క అందిస్తున్న పూర్వ విద్యార్థులు, నాయకులు

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ రాజిరెడ్డిని ఆ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుల పల్లి సంగారెడ్డి, అనిల్ రెడ్డి, మధుసూదన్, రాకేశ్, సాయికిరణ్‌తో పాటు ఇతర విద్యార్థులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా విశ్వవిద్యాలయంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

కుల గణనపై సిబ్బందికి అవగాహన


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో కుల గణనపై సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉప కమిషనర్ రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన అనంతరం యాప్ ద్వారా సేకరించాల్సిన డాటాను వివరించారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వార్డుల వారీగా కుల గణనను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే సర్వే పూర్తి చేశామన్నారు. సిబ్బందికి ఆయా ప్రాంతాల్లో డాటాను అందజేసి కుల గణనను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొదటి దఫా అవగాహన కార్యక్రమాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ సర్పంచ్ స్వరూప

మణికొండ: గోపన్‌పల్లి తండాకు చెందిన కొండయ్య కూతురు శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. అయితే ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో ల్యాప్‌టాప్ కొనేందుకు ఇబ్బందులు పడుతున్నది. దీంతో ఆర్థిక సాయం చేయాలని ఆమె తండ్రి వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ జి.స్వరూపనగేష్ యాదవ్ కోరగా ఆమె స్పందించి రూ. 11వేలను మంగళవారం అందించారు.

వృథాగా తాగునీరు..!



బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరం చెరువులోని వాటర్ ట్యాంక్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. కొన్ని రోజులుగా వృథాగా పోతున్న జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

–బండ్లగూడ

చిరువ్యాపారుల పైకి దూసుకెళ్లిన కారు


ప్రమాదస్థలం వద్ద స్థానికులు

రాజేంద్రనగర్: కారు బీభత్సం సృష్టించిన ఘటనలో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు గాయపడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి హైదర్‌గూడలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడ 16 షెట్టర్ల వద్ద ఓ కారు వేగంగా దూసుకువచ్చి రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వెంటనే స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అయితే ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు.

టైగ్రాడ్ ప్లస్ రీజినల్ ఫైనల్స్–2024 విజేతలు

గ్రీన్ ఫ్యూజన్, జీ–ఐ, రెడ్‌స్ట్రింగ్ జట్లు

రాయదుర్గం: 'టై'గ్రాడ్ ప్లస్ రీజినల్ ఫైనల్స్–2024 విజేతలను మంగళవారం ప్రకటించారు. స్టార్టప్‌లలో అత్యుత్తమమైన వాటికి నగదు పురస్కారాలను అందించారు. ఈ పోటీలో పన్నెండు జట్లు పాల్గొన్నాయి. ఎస్కీ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను ఎంపిక చేశారు. భీమవరంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పరిశ్రమల కోసం ఎనర్జీ మానిటరింగ్ స్టార్టప్ అయిన 'గ్రీన్ ఫ్యూజన్' స్టార్టప్ విజేతగా నిలిచింది.లక్ష రూపాయల ప్రైజ్ మనీని స్టార్టప్ నిర్వాహకులకు అందించారు. నగరంలోని జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ నుంచి ఒక కాంపాక్ట్, సరసమైన కంటి పరీక్ష పరికరం జీ–ఐ స్టార్టప్ మొదటి రన్నరప్‌గా నిలిచి రూ.50వేలు అందుకుంది. అదేవిధంగా 'రెడ్ స్ట్రింగ్'ను రూపొందించిన గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి రెండవ రన్నరప్‌గా పిలిచి రూ.20వేల నగదు అందుకుంది. కార్యక్రమంలో టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ళ, టై హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీని చందుపట్ల, టైగ్రాడ్ కమిటీ ప్రతినిధి భానుప్రకాశ్, టైగ్రాడ్ కమిటీ కో చైర్‌పర్సన్ డాక్టర్ నందితాసేథి ప్రసంగించారు.

31లోగా నీటి బిల్లులు చెల్లించండి

శంషాబాద్: వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా బకాయిలున్న నీటి బిల్లులను ఈ నెల 31 లోగా చెల్లించాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ హసీనా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకేసారి మొత్తం చెల్లింపు ద్వారా బకాయిలో ఉన్న ఆలస్య రుసుం లేకుండా వడ్డీ రాయితీని కూడా పొందే అవకాశం ఉందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐదు డీఏలు చెల్లించాలి

అత్తాపూర్: ఉపాధ్యాయులకు బకాయి పడిన ఐదు డీఏ (కరువు భత్యం) చెల్లించాలని ఎస్‌టీయూ రాజేంద్రనగర్ అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, వెంకటయ్య మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐదు డీఏలు బకాయి ఉండగా ఒక్క డీఏ ఇవ్వడం తగదని పేర్కొన్నారు. అలాగే పీఆర్సీ గురించి కూడా ప్రభుత్వం నోరు మెదపడం లేదని, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

శంషాబాద్: జలవనరులు, భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రంగారెడ్డి జిల్లా భూగర్భ జలాల అసిస్టెంట్ డైరెక్టర్ మాధవరావు అన్నారు. పట్టణంలోని తొండుపల్లి జడ్పీ పాఠశాలలో భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో 'భూగర్భజలాలపై పట్టణీకరణ ప్రభావం..పునరుద్ధీకరణ పద్ధతులు' అనే అంశంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నీటి కలుషితాన్ని నివారించడంతో పాటు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే వివేక్‌కు సన్మానం



రాజేంద్రనగర్: జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌సీఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి పచ్చ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు చంద్రప్రభ, రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు పర్యావరణ కమిటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు


రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన పర్యావరణ కమిటీ ఆధ్వర్యంలో 'విమానాశ్రయ పరిసరాల శుభ్రత, పక్షుల సంచారంతో విమానాలకు కలిగే ప్రమాదాలు' తదితర అంశాలపై అధికారులు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన పట్టణంలోని శారదావిద్యామందిర్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు జీ నందిని, టీ ప్రియ, తొమ్మిదో తరగతికి చెందిన అఖిల్, ప్రవీణ్‌కు బదిలీ అయిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ఎయిర్‌పోర్టులో ప్రశంసా పత్రాలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు కీలకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఎయిర్‌పోర్టు ఉన్నతాధికారులు, శారదా విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరం


హైదర్‌గూడ సర్వీస్ రోడ్డులో దిమ్మెలను ఏర్పాటు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అత్తాపూర్: రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజేందర్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్, హైదర్‌గూడ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డును బ్రేక్ చేసి తొలగించి రాంగ్ రూట్ ప్రయాణం చేస్తుండడంతో మంగళవారం దిమ్మెలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తాపూర్, హైదర్‌గూడ ప్రాంతాల్లోని పిల్లర్ నంబర్ 137, 145 వద్ద దిమ్మెలను బ్రేక్ చేసి వాహనాదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారని దీని కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తిరిగి దిమ్మెలను ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

జర్నలిజంలో కచ్చితత్వం, సమగ్రత అవసరం

ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ అధ్యక్షుడు ప్రొ.సతీష్‌కుమార్‌రాయ్

రాయదుర్గం: జర్నలిజాన్ని పవిత్రమైన బాధ్యతగా మహాత్మాగాంధీ భావించేవారని ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సతీష్ కుమార్‌రాయ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ ఆధ్వర్యంలో 'జర్నలిజం ఆఫ్ మహాత్మాగాంధీ'అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజంలో కచ్చితత్వం, సమగ్రతకు కట్టుబడి ఉండాలని తోటి జర్నలిస్టులను గాంధీ కోరేవారని అన్నారు. ప్రస్తుత మీడియా సవాళ్లకు ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు గాంధీ ఆశయాలను ఎలా అన్వయించవచ్చో పరిశీలించాలని ఆయన జర్నలిజం విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మనూ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో కేన్సర్‌పై అవగాహన సదస్సు



గోల్కొండ: సకాలంలో గుర్తిస్తే కేన్సర్‌ను నయం చేయవచ్చునని సర్జికల్ యాంకలజిస్ట్ డాక్టర్ రాకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కేన్సర్‌పై గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. రెనోవా బీబీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధికి గతంలో సకాలంలో గుర్తించలేని పరిస్థితి ఉండేదని అయితే నేడు వైద్య రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. సరైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తే కేన్సర్ గుర్తు పట్టవచ్చునన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు, సర్జికల్ యాంకలజిస్ట్ డాక్టర్ గౌతమ్, రేడియేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ అక్రం తదితరులు పాల్గొన్నారు.

సదర్‌కు ఆహ్వానం


మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లో నిర్వహించనున్న సదర్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ బుద్వేల్ యాదవ సంఘం సభ్యులు మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డిని మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. సంఘం అధ్యక్షుడు మజ్జిగ నరేశ్ యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

నార్సింగిలో రేపు సదర్ ఉత్సవాలు

మణికొండ: దీపావళి పండగను పురస్కరించుకుని యాదవులు నిర్వహించే సదర్ ఉత్సవాలను నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం రాత్రి 8గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు పలు జాతులకు చెందిన దున్నపోతులను రప్పిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ


రోడ్డుపై బోల్తాపడిన టాటా ఏస్

మణికొండ: ముందువెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో అది పల్టీ కొట్టి డ్రైవర్‌కు గాయాలైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ మిలట్రీ స్కూల్ ఎదుట మంగళవారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మురుమురాల లోడుతో వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని లారీ వెనకనుంచి ఢీకొట్టడంతో అది బోల్తా కొట్టింది. దాంతో అందులోని డ్రైవర్ పోచయ్యకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ సర్‌ఫ్రాజ్ పారిపోతుండగా స్థానికులు పట్టుకుని నార్సింగి పెట్రోలింగ్ పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ డ్రైవర్‌ను చికిత్స కోసం లంగర్‌హౌస్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.